

నగరంలో తిరుగులేని శక్తిగా సీపీఐ



సీపీఐ నగర మహాసభలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నగరంలో సీపీఐ తిరుగులేని శక్తిగా అవతరించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని బద్దంఎల్లారెడ్డి భవన్‌లో సీపీఐ నగర 11వ మహా సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఐ ఎదుగుదలకు ప్రతి కార్యకర్త శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. ఎర్ర జెండా అంటేనే దోపిడీ దారులకు పేదలకు అణచివేసే వారికి గుండెల్లో రైళ్లుపరిగెడతాయన్నారు. స్మార్ట్‌సిటీ పనుల్లో జరిగిన అవినీతిపై పాలక ప్రభుత్వాలు నోరు మెదపడం లేదన్నారు. తీగల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్‌లో కోట్ల రూపాయల దోపిడీ జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరాటం చేయాల్సిన అవసరంఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి జెండా ఆవిష్కరించారు. మహసభలకు న్యాలపట్ల రాజు, బీర్ల పద్మ అధ్యక్షత వహించారు. సీపీఐ నగర కార్యదర్శి కసి రెడ్డి సురేందర్‌రెడ్డి రిపోర్ట్‌ను ప్రవేశపెట్టారు. సమావేశంలో పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, పంజాల శ్రీని వాస్, నలువాల సదానందం, సాయవేణి రాయమల్లు, శారద, బోన గిరి మహేందర్, గామినేని సత్యం,కొట్టె అంజలి,ఎలిశెట్టి భారతి పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ విజేతకు బహుమతి అందజేత



'ఆంధ్రజ్యోతి' కార్,బైక్ రేస్ ప్రథమ బహుమతి విజేత పెద్దపల్లి ఎన్టీపీసీకి చెందిన దేవునూరి శ్వేత, శ్రీహర్ష దంపతులకు బైక్ ను అందజేస్తున్న కరీంనగర్ బ్రాంచి మేనేజర్ కళ్లెపు సంపత్ రెడ్డి, డిప్యూటీ సర్క్యు లేషన్ మేనేజర్ పాపారావు, డిప్యూటీ మేనేజర్ (అడ్వర్టయిజ్‌మెంట్) శ్రావణ్

పరిహారం ఇచ్చేదెప్పుడు?

- ఏళ్లుగా కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్వాసితుల ఎదురుచూపులు
- 28 ఇళ్లు, 98.19 ఎకరాలు కోల్పోతున్న గ్రామస్థులు
- సర్వేలు చేసి వెళ్లిపోతున్న అధికారులు

కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైను గంగాధర మండలం కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం,ఉప్పరమల్యాల గ్రామాల మీదుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు ఆ గ్రామాల్లోని భూముల్లో సర్వేలు నిర్వహించి హద్దులు పాతారు. అంతే మళ్లీ అటువైపు రాలేదు. ఆ గ్రామాలకు చెందిన రైతులు ఏదైనా అవసరం ఉండి భూములు అమ్ముకుందామన్నా వీలు లేకుండా పోయిం ది. ఏళ్లు గడిచినా పరిహారంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పం దించి నిర్ణయం తీసుకోవాలని కోరు తున్నారు.

గంగాధర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ నిర్వాసితులు బాధితులు ఏళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం,ఉప్పర మల్యాల గ్రామాల మీదుగా రైల్వే లైను నిర్మాణం నిర్మించడానికి 18 ఏళ్ల క్రితం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2020 ఫిబ్రవరిలో బహిరంగా ప్రకటనను విడుదల చేసి రైల్వే లైనులో కోల్పోతున్న వ్యవసాయ భూములు, బావులు, చెట్లు, పైపులైను, ఇళ్ల వివరాలను ప్రకటించారు. పలుమార్లు అధికారులు రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి, సర్వేలు నిర్వహించారు. గ్రామ సభలు నిర్వహించి సర్వేలు చేపట్టడంతో పరిహారం పైసలు వస్తాయని ఆశతో ఏళ్లుగా ఎదురు చూస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పరిహారం కోసం తిరిగి 2024 సెప్టెంబరులో భూసేకరణ కోసం ప్రకటన విడుదల చేశారు. అనంతరం పలుమార్లు కరీంనగర్ ఆర్డీవో, భూసేకరణ అధికారులు, రైల్వే అధికారులు గ్రామ సభలు నిర్వహించి ముంపు వివరాలను వెల్లడించి అభ్యంతరాలు కోరారు. ప్రభుత్వాలు మారినా పరిహారం అందడంలేదని బాధితులు వాపోతున్నారు. పరిహారం అందుతుందని కొండంత ఆశతో ఇళ్లు, భూములు కోల్పోతున్న బాధితులు అప్పులు చేసి కొందరు ఇళ్లు కట్టుకున్నారు. మరి కొందరు వ్యవసాయ భూములు కొనుక్కున్నారు. ఇటు భూములు తీసుకోక, పరిహారం అందించక పోవడంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రైల్వే లైనులో కోల్పోతున్న గృహాలు

● భూములు అమ్ముకుందామన్నా ఇబ్బందులు

కొందరు కుటుంబాల్లో పిల్లలకు పెళ్లి చేసేందుకు భూములు అమ్ము కుందామంటే అధికారులు సర్వే లు చేస్తు కాలయాపన చేస్తుం డగా ఎటు తోచడం లేదని రైతులు వాపోతున్నారు. ఇటు భూములు అమ్ముకోలేక, పరిహారం అందక మనోవేదనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందిం చి పరిహారం అందించి ఆదుకో వాలని ముంపుగ్రామాల ప్రజలు కోరు తున్నారు. ఇదే రైల్వే లైనులో కొండన్నపల్లి అటు బోయిన్‌పల్లి మండల రైతుల భూములకు గతంలోనే పరిహారం అందిం చారు. పక్క గ్రామాల రైతు లకు పరిహారం అందించి మండలంలోని రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం గ్రామాల ప్రజలకు పరిహారం అందించకపోవడంతో అసలు నష్ట పరిహారం వస్తుందా రాదానే సందేహం బాధితుల్లో నెలకొందని వాపోతున్నారు.

● ముంపులో ప్రభుత్వ పాఠశాల


రైల్వే నిర్మాణంలో రంగరావుపల్లి ప్రభుత్వ పాఠశాల ముంపునకు గురువుతుంది. ఈ పాఠశాల గ్రామంలో కూడలిలో విద్యార్థులకు అందుబాటులో ఉండగా రైల్వే లైను నిర్మాణంలో పోతుంది. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ఏంటని తల్లిదండ్రులు వాపోతున్నారు. మరోవైపు గ్రామానికి ఏళ్లుగా మంచినీరందించే బావి రైల్వే లైనులో పోతుంది. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా పాఠశాలను నిర్మించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రేషన్ కార్డుల్లో గందరగోళం

- చొప్పదండి యువకుడికి సిద్దిపేట జిల్లాలో కార్డు
- తప్పులను సరి చేయాలంటున్న లబ్ధిదారులు

చొప్పదండికి చెందిన దండే మహేశ్ రేషన్‌కార్డులో భార్య, కుమారుడి పేర్లను చేర్చాలని ప్రజాపాలన సభలో దరఖాస్తు చేసుకున్నాడు. అత్తగారి ఇంటి రేషన్ కార్డు నుంచి భార్య పేరును తొలగించు కున్నాడు. భార్య, కుమారుడి పేరుతో కొత్త రేషన్‌కార్డు వస్తుందనుకొని ఎదురు చూశాడు. ఆయనకు నిరాశే ఎదురైంది. కొత్త రేషన్ కార్డు గందర గోళంగా వచ్చింది. భార్యతోపాటు కుమారుడి పేరు గంగాధర మండలం గర్శకుర్తిలోని ఆయన భార్య పుట్టింటి కార్డులో చేరాయి. భార్యపేరును అక్కడికార్డులో తొలగించినప్పటికీ మారిన ఇంటి పేరుతో తిరిగి అదేకార్డులో నమోదు చేశారు. కుమారుడి పేరు కూడా గర్శకుర్తి లోని తన అత్తమామల కార్డులోకి చేరిపో యాయి. ఇలా చాలా మంది పేర్లు భార్య పుట్టింటి కార్డులోకి చేరాయి.



గంగాధర మండలానికి కేటాయించిన చొప్పదండి రేషన్ కార్డు

చొప్పదండి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల జారీలో గందరగోళం నెలకొంది. కొత్త, పాత కార్డులలో మార్పులు, చేర్పుల కోసం ప్రజాపాలనలో చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. కొత్తగా వచ్చిన రేషన్ కార్డులో వివరాలు ఒక చోటుకి బదులు మరోచోట పేర్కొనడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

చొప్పదండి మున్సిపల్ పరిధిలో 1200, మండలంలోని గ్రామాల నుంచి రెండు వేల మంది కొత్త, పాత కార్డులలో మార్పులు, చేర్పుల కోసం ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు. అనేక సంవత్సరాల తరువాత రేషన్‌కార్డులు వస్తున్నాయని భావించిన వందలాది మందికి భంగపాటు తప్పలేదు. ఇటీవల కొత్త రేషన్ కార్డులను జారీ చేస్తుండగా అనేకమంది కార్డులు గందరగోళంగా వచ్చాయి. కథ మళ్లీ మొదటికి రాగా ప్రజలు తిరిగి కార్డులను సవరించాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పెళ్లైన మహిళలు తమ పేర్లను అత్తారింటికి మార్చాలని దరఖాస్తులు చేసుకోగా సీన్ రివర్స్ అయ్యింది. భార్య అత్తా రింటికి బదులుగా భర్తలను అత్తగారి కార్డుల్లోకి చేర్చారు. కొందరి రేషన్ కార్డులో జిల్లాలు కూడా మారి పోయాయి.

> చొప్పదండి పట్టణానికి చెందిన రాజశేఖర్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోగా సిద్దిపేట జిల్లాలోని కోహెడలోని అత్తగారి కార్డులోకి మార్చారు.

> చిట్యాలపల్లిలో తల్లిదండ్రుల పేర్లు లేకుండా మూడేళ్ల పాపకు రేషన్ కార్డు మంజూరు కాగా తల్లిదండ్రులు అధికారుల చుట్టూ తిరుగగా ముగ్గురిని కలుపుతూ కొత్త కార్డును పునరుద్ధరించారు.

● ఆధార్ అనుసంధానంతో గందరగోళం

ప్రజాపాలనలో రేషన్ కార్డుల దరఖాస్తులు చేసుకోవడానికి గ్రామ పంచాయతీలలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దరఖాస్తులను గ్రామాల్లో పంచా యతీ కార్యదర్శులు, పట్టణంలో మున్సిపల్ సిబ్బంది ఆధార్ నంబర్‌తో లాగిన్‌లో అప్లోడ్ చేశారు. రేషన్‌కార్డులకు ఆధార్ అనుసంధానంతో అక్కడి కార్డులు ఇక్కడ, ఇక్కడి కార్డులు అక్కడ వచ్చినట్లు తెలుస్తోంది. భార్య ఆధార్ నంబర్‌ను లాగిన్‌లో అప్‌లోడ్ చేయగానే పాతకార్డుకు అనుసంధానమైనట్లు చెబుతు న్నారు. గతంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో దరఖాస్తులను అప్ లోడ్ చేయగా ఎలాంటి తప్పులు జరుగలేదు. కాగా రేషన్‌కార్డులు అత్తగారి ఇంటికి మారడంతో కొందరు రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హత కోల్పోయారు. రేషన్ కార్డులో తప్పుల కారణంగా యువవికాసం పథకానికి దరఖాస్తు చేసు కోలేకపోయారు. తమ కార్డులో తప్పుల సవరణల కోసం లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వెంటనే తమ కార్డులను సవరించాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



ప్రార్థనలు చేస్తున్న క్వాయర్ బృందం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు చెప్పిన ఏడు వాక్యాలను గుర్తుకు తెచ్చుకుని ఆధ్యాత్మిక భావంతో పులక రించిపోయారు. బైబిల్ పఠనాలు, ప్రార్థనలతో పాటు క్వాయర్స్ బృందం గీతాలు ఆలపించి జీసస్‌పై భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఉపవాస దీక్షలను విరమించి దాన ధర్మాలు చేశారు. బహుమతులను పంచారు.

● సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చ్‌లో..

సీపీ కార్యాలయం వద్ద సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చ్‌లో పాస్టరేట్ చైర్మన్ ఆర్ పాల్ కొమ్మాలు సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్బిటర్ మధుమోహన్, కార్యదర్శి సీహెచ్ దేవదాసు, వర్డర్ ఎస్ ప్రేమ్‌కుమార్, ట్రెజరర్ జి నిల్సన్, పాస్టరేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చ్‌లో..

క్రిస్టియన్ కాలనీలోని సీఎస్ఐ సెంటినరీ వెస్లీ చర్చ్‌లో పాస్టరేట్ చైర్మన్ ఎస్ జాన్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రెస్బిటర్ ఎం పిం టు, కార్యదర్శి సి నారాయణ, కోశాధికారి సంజయ్‌కుమార్, పాస్టరేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● జ్యోతీనగర్‌లోని లూర్దుమాత చర్చ్‌లో ఫాదర్ తుమ్మ సంతోష్‌రెడ్డి సందేశమివ్వగా చర్చ్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు డి ఇన్నారెడ్డి, బి జార్జిరెడ్డి, కార్యదర్శి మరియకుమార్, సభ్యులు జరోంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, కోటి, ఇన్నారెడ్డి, సునీల్‌రెడ్డి, గోపు రవి పాల్గొన్నారు. జగిత్యాల రోడ్, బేతేలు చర్చ్‌లో ప్రార్థనలు నిర్వహించారు.



లూర్దుమాత చర్చిలో క్రీస్తు శిలువ ప్రదర్శన

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రత్నాకరం కోటంరాజ్

భగత్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మే 20న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకరం కోటంరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులపై కక్షపూరితంగా నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకువచ్చిందన్నారు. లేబర్‌కోడ్‌లతో భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు పూర్తిగా లేకుండా పోతాయన్నారు. కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని కార్మికులకు వివరించి సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కదిరే రమేష్, ఉపాధ్యక్షుడు జంబుకం వెంకన్న, పళ్ల తిరుపతి, కన్నం నరసయ్య, రాజాకుమారి, స్వామి, లింగారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, ఆశీర్వాదం సుధాకర్, కొమురయ్య, సంపత్, రాజయ్య, సదానందం, నరేష్ పాల్గొన్నారు.

సంస్కరణల పేరుతో పాఠశాలల కుదింపు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగ సంస్కరణ పేరిట రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల కుదింపునకు ప్రయత్నిస్తోందని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం సోమయ్య విమర్శించారు. డీటీఎఫ్ 15వ వార్షిక కౌన్సిల్ సమావేశం శుక్రవారం కరీంనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాఠశాల విద్యా రంగం ధ్వంసమైందన్నారు. బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించి విద్యారంగాన్ని సంస్కరణల ద్వారా పునరుజ్జీవనం కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోందన్నారు. ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అవాల నరహరి, ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అటుకుల శ్రీనివాస్‌రెడ్డి, పి ఈశ్వర్‌రెడ్డి, కె నారాయణరెడ్డి, ఎం రఘుశంకర్‌రెడ్డి, ఎ సంతోష్‌రెడ్డి, డి శ్రీహరి, కె రాజమౌళి, ఎ దామోదర్, సముద్రాల అంజయ్య, చకినాల రామ్మోహన్, ఎ శ్రీనివాస్, జయప్రద, గౌతమి, వి రత్నం కోహెడ చంద్రమౌళి, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాల భవన్ పిలుస్తోంది ..

- 24 నుంచి వేసవి శిక్షణా తరగతులు
- పలు అంశాల్లో శిక్షణ



మృదంగం నేర్పుతున్న శిక్షకుడు (ఫైల్)

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బాలభవన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కలెక్టర్, విద్యాశాఖ సహకారంతో ఈ నెల 24 నుంచి జూన్ 10 వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ప్రతీ రోజు ఉదయం 7 నుంచి ఒంటి గంట వరకు ఈ తరగతులు కొనసాగనున్నాయి. శిక్షణకార్యక్రమానికి 5 నుంచి 16 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలు అర్హులు. పాల్గొనే ఔత్సాహిక బాల బాలికలు తమ ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో అందించి పేర్లను అంబేద్కర్ స్టేడియంలోని శిక్షణ శిబిరంలో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

● ఈ అంశాల్లో శిక్షణ

ఎస్ కృష్ణకుమార్ పర్య వేక్షణలో చిత్ర లేఖనం, పెన్సిల్ పెయిం టిగ్స్, హ్యాం డ్ రైటింగ్, కె మంజులా దేవి శిక్షణలో గాత్ర సంగీతం, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలపై శిక్షణ ఇస్తారు. శ్రీధర్ నేతృ త్వంలో మృదంగం, తబల, కంజీర, సంగెం రాధాకృష్ణ ఆధ్వర్యంలో జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యం, సూర్యశ్రీ శిక్షణలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహందీ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. మిగతా వివరాలకు అంబేద్కర్ స్టేడియంలోని బాలభవన్ కేంద్రాన్ని సంప్రదిచంచవచ్చు. ఇవి కాకుండా ప్రత్యేకంగా యోగాను మల్లిక, చెస్ అనూప్, శాస్త్రీయ నృత్యం సుహాసిని, అబాకస్ రాధిక, కర్రసాముపై రాజేందర్ శిక్షణ ఇవ్వనున్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి..

- కట్ట మంజులాదేవి, సూపరెంటెండెంట్, బాలభవన్



ప్రతీ యేటా చిన్నారుల నుంచి, తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తోంది. నచ్చిన అంశాల్లో శిక్షణ కోసం చిన్నారులను ప్రభుత్వం తరఫున బాలభవన్ ఆహ్వానిస్తోంది. మానసిక, శారీరక, వ్యక్తిత్వ వికాసం కోసం ఈ ఉచిత శిక్షణ తరగతులను అందరూ వినియోగించుకొని నైపుణ్యాలను పెంచుకోవాలని కోరుతున్నాం. 45 రోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేయనున్నాం. శిక్షణ కోసం తమ వంతు సహకారాన్ని అందిస్తున్న ప్రభుత్వానికి, జిల్లా కలెక్టర్‌కు, విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు.

హుజూరాబాద్‌లో పట్టపగలే చోరీ..

● సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని మార్కండేయ కిరాణం షాపులో శుక్రవారం పట్టపగలే గుర్తుతెలియని వ్యక్తులు సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్ ఎత్తుకెళ్లారు. సదరు గుర్తుతెలియని వ్యక్తులు కిరాణం సామగ్రి కోసం షాపునకు వచ్చారు. షాపు యజమాని లోపలికి వెళ్లి సామగ్రి ఇస్తుండగా, కౌంటర్‌పై ఉన్న సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌ను దొంగలించారు. ఇది గమనించిన షాపు యజమాని మార్కెండేయ పోలీసులకు సమాచారం అందించగా, సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. 15రోజుల క్రితమే హుజూరాబాద్ పట్టణంలోని రెండుషెటర్లను పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు. అది మరవకముందే మరోదొంగతనం జరగడంతో పట్టణప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ముగురికి గాయాలు

మానకొండూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్-వరంగల్ ప్రధానరహదారిపై మానకొండూర్‌లో శుక్రవారం లారీని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. సూర్యపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(టీఎస్ 29 టీబీ 3876)లో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. బస్సు ముందు ఉన్న గ్రానైట్ లారీ(టీఎస్ 02 యుబి 8907) సడన్ బ్రేకు వేశాడు. దీంతో లారీ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన మణికంఠ, రజిత, భారతికి గాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రెండు వాహనాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మినీ వ్యాన్, ఆటో ఢీ..

● నలుగురికి గాయాలు



నుజ్జు నుజ్జు అయిన ఆటో

కోనరావుపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్ ఆటోలో గ్యాస్‌సిలిండర్లను డెలివరీ చేయడానికి వెళుతున్నాడు. కొలనూరు గ్రామానికి చెందిన శిల్ప, లాస్య, సుదర్శన్ ముగ్గురు టాటా ఏసీలో కోనరావుపేటకు వస్తున్నక్రమంలో నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయ ఆవరణలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనివాస్, శిల్ప,లాస్య, సుదర్శన్‌కు తీవ్ర గాయాలుకాగా, సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోనరావుపేట ఎస్‌ఐ ప్రశాంత్‌రెడ్డి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఔషధ మొక్కలకు జీవం

ఆర్జీ-3లో 42 రకాల ఔషధ మొక్కలతో నర్సరీ ఏర్పాటు



రామగిరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కలకు జీవం పోసేందుకు సింగరేణి యాజమాన్యం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొలిసారిగా ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలోని ఔషధ మొక్కల నర్సరీని పబ్లిక్ పార్కుకు ఎదురుగా ఏర్పాటు చేసింది. విశాలమైన స్థలంలో ఔషధ మొక్కలను ఏర్పాటు చేసి సంరక్షణ చర్యలు చేపడుతోంది. సదరు కేంద్రంలో 42 రకాల వివిధ ఔషధ మొక్కల పెంపకం చేపడుతోంది. తొలి అడుగుగా సుమారు అరఎకరంలో ఔషధ మొక్కల నర్సరీని సింగరేణి ఫారెస్ట్ విభాగం ఏర్పాటు చేసింది. ప్రత్యేకంగా మొక్కల పెరుగుదల కోసం సేంద్రియ ఎరువులను వినియోగించి ఔషధ మొక్కలను సంరక్షణ బాధ్యతలను తీసుకుంది. అన్ని రకాల దీర్ఘకాలిక జబ్బులకు ఉపయోగపడే ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంపకం చేపట్టింది. ప్రస్తుతం నర్సరీలో వనమూలికలు సేకరించేందుకు వీలుగా మొక్కలు అందు బాటులోకి రావడం విశేషం. అందులో ప్రధానంగా క్యాన్సర్, ఆస్తమా, షుగర్, బీపీ లాంటి వ్యాధులను నయం చేసే మొక్కల పెంపకం చేపట్టింది. వ్యాధుల నివారణకు వినియోగించే మొక్కలపై స్థానికులకు అవగాహన కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యం చర్యలు చేపడుతోంది.



ఆర్జీ-3 డివిజన్‌లో ఔషధ మొక్కల కేంద్రం

ఔషధ మొక్కలను అందిస్తాం

ఆర్జీ-3 ఫారెస్ట్ అధికారి: కల్యాణ్



ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీకాలనీలో పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగా ఔషధ మొక్కల నర్సరీని ఏర్పాటు చేశాం. ఇందులో దీర్ఘకాలిక వ్యాధుల నివారణ కోసం ఏర్పాటు చేసిన మొక్కలు లభ్యం అవుతాయి. ఆయుర్వేదం ఆదరణ కరువైన నేపథ్యంలో వాటి ప్రాధాన్యాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా డివిజన్‌లో తొలిసారిగా ఔషధ మొక్కల పెంపకాన్ని చేపట్టింది. మండలంలోని కేవీకే, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఔషధ మొక్కల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. ఔషధ మొక్కలను అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. కార్మిక కుటుంబాలు ఆసక్తి కనబరిస్తే వారికి ఔషధ మొక్కలను అందించేందుకు సింగరేణి సుముఖంగా ఉంది.

అకాల వర్షం..అపార నష్టం

● తడిసిన ధాన్యం ● నేల రాలిన మామిడి ● ఎగిరిపోయిన ఇంటి పైకప్పులు



కోరుట్లలో నేల కొరిగిన నువ్వు చేను



కోరుట్లలో నేల రాలిన మామిడి కాయలు



మెట్‌పల్లి మండలం ఎర్దండిలో కూలిన గుడిసె వద్ద కుటుంబ సభ్యులు

కోరుట్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కోరుట్ల, మెట్‌పల్లి, భీమారం, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, కథలాపూర్ తదితర మండలాల్లో శుక్రవారం అకాల వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కోతకు వచ్చిన వరి నేల వాలింది. నువ్వు పంట నేలవాలి రైతులు లబోదిబోమన్నారు. కోరుట్ల మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, చిన్నమెట్‌పల్లి, పైడిమడుగు, సర్పరాజుపూర్, అయిలాపూర్, కల్లూర్ గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో మామిడి నేల రాలింది. కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొంత మేర తడవగా నువ్వు పంట నేలకొరిగింది. మామిడి నేల రాలడంతో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. గాలి బీభత్సంతో మాదాపూర్ గ్రామ శివారులోని రాయికల్-కోరుట్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న తాటి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై వాలింది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్ శాఖ అధికారులు మరమ్మత్తులు చేసి సరఫరాను పునరుద్ధరిచారు.

●మెట్‌పల్లిటౌన్: మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం గాలివానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంతోపాటు ఆయాగ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిచింది. ఎర్దండి గ్రామ శివారులోని ఒడ్డెర కాలనీలో నివాసం ఉంటున్న గుడిసెలు తీవ్రగాలులతో లేచిపోయాయి. దీంతో అందులో నివాసం ఉంటున్న కుటుంబాలు ఆశ్రయం లేక రోడ్డున పడ్డాయి.

●భీమారం: భీమారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. భీమారం మండల కేంద్రానికి చెందిన నల్ల పోచయ్య ఇంటి పైకప్పు లేచిపోగా, భూదేవికి చెందిన ఇల్లు కూలిపోయింది. కొనుగోలు కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. మండలంలోని వడ్లకొండ విశ్వంభర్, పెద్దిరెడ్డి స్వామి రెడ్డి, అడువాల రాజేశం తదితర రైతులకు చెందిన మామిడి తోటల్లో మామిడి కాయలు రాలాయి.

●కథలాపూర్: మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగి పడ్డ ఘటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో ఐస్ లైన్డ్ రిఫ్రిజిరేటర్ (ఐఎల్ఆర్), రెండు డీప్ ఫ్రీజర్లు, వ్యాక్సిన్ క్యారియర్ బాక్స్‌లు కాలిపోయాయి. గదిలో ఉన్న ఫర్నిచర్ కాలి బూడిదయిందని ఈ ప్రమాదంలో రూ.25 లక్షల ఆస్తినష్టం సంభవించిందని హెచ్‌ఈఓ శ్రీధర్ తెలిపారు. మండలంలోని పలుగ్రామాల్లో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోగా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిపోయింది.

● కోరుట్ల: కోరుట్ల పట్టణంలో శుక్రవారం గాలి వాన బీభత్సం సృష్టించింది. పట్టణంలోని రాంనగర్, బీలాల్‌పుర, అల్లమయ్య గుట్ట ప్రాంతాల్లో సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

●ముస్తాబాద్: మండలంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. ముస్తాబాద్‌తోపాటు మద్దికుంట, చీకోడ్ గ్రామాల్లో భారీగా పంటనష్టం జరిగింది. వర్షంతోపాటు ఈదురు గాలులతో వరిగింజలు, మామిడి కాయలు రాలిపోయాయి. ముస్తాబాద్‌కు చెందిన ఎలుసాని దేవయ్య అనే రైతుకు చెందిన దాదాపు అయిదు ఎకరాల వరిపంట పూర్తి స్థాయిలో నెలమట్టమయింది. కొనుగోలు సెంటర్లలో ధాన్యం తడిసిపోయింది. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పంట నష్టం జరిగింది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. బాధిత రైతులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు పరామర్శించారు.

● గంభీరావుపేట: గంభీరావుపేట మండలంలో శుక్రవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన రాళ్లవాన వరి పంటలకు అపారనష్టం వాటిల్లింది. ఈదురుగాలులకు కోతలకు వచ్చిన వరిచేలు నేలపాలయ్యాయి. కోసి కుప్పలు పోసిన వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది. ప్రధానంగా కొత్తపల్లి, ముచ్చర్ల గ్రామాల్లో రాళ్లవానతో వరిపంటలకు తీవ్రనష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. కొత్తపల్లికి చెందిన బాలయ్య, మహేష్, శంకర్, దేవేందర్, సంజీవం తదితర రైతుల పంటలకు అపార నష్టం వాటిల్లింది. ముచ్చర్లలో జీవన్, కిషన్, మల్లయ్య, ఎల్లయ్య, వెంకటస్వామి, దేవయ్య, తదితర రైతులకు చెందిన కోతకు వచ్చిన వరి రాళ్ల వానతో నష్టం కాగా, భిక్షపతి, కనకయ్య, రవీందర్‌రెడ్డి, దుర్గయ్య, నర్సయ్య, రమేష్ తదితర రైతుల కోతలు కోసి కల్లాల వద్ద ఉంచిన ధాన్యం తడిసిపోయింది. నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని రైతులు కోరారు. ఇదిలా ఉండగా రాజుపేటలో వర్షానికి ధాన్యం తడిసిపోయింది. నర్మాలలో ఈదురు గాలులకు రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగిపడగా, ముచ్చర్ల నుంచి పోతారం వెళ్లే దారిలో కూడా ఈదురు గాలులకు చెట్టు విరిగిపడింది.

అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదు
● పీడీ యాక్ట్ కేసులో నాలుగు సంవత్సరాల జైలుశిక్ష
● జమ్మికుంటలో అదుపులోకి తీసుకున్న పోలీసులు



అంతర్‌జిల్లా దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జమ్మికుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలో మూడు రోజుల క్రితం వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలు తాడు ఎత్తుకెళ్లిన అంతర్‌జిల్లా దొంగను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, పట్టణసీఐ వరంగంటి రవికుమార్ చోరీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా వడ్డెరకాలనీకి చెందిన అల్లెపు కృష్ణ ఎక్కడకు వెళ్లిన తాను పంచాయతీ కార్యదర్శిని అని, పెన్షన్ ఇప్పిస్తానని చెప్పుకుంటూ అమాయకప్రజలను నమ్మిస్తూ వారి మెడలోని బంగారుగొలుసులు ఎత్తుకెళ్తుంటాడు. మూడు రోజుల క్రితం జమ్మికుంటలోని కొండూర్‌కాంప్లెక్స్‌లో అల్లెపురెడ్డి కమలమ్మ-కొంరారెడ్డి వృద్ధ దపంతులను అదేవిధంగా నమ్మించి బురిడీ కొట్టించాడు. రూ.4వేల పెన్షన్ ఇప్పిస్తానని చెప్పి, మెడలోని రూ.80వేల విలువగల పుస్తెలతాడు ఎత్తుకెళ్లాడు. చోరీని సీరియస్‌గా తీసుకున్న పోలీస్‌లు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. మూడురోజుల వ్యవధిలో సదరు దొంగను వలపన్ని పట్టుకున్నారు. మళ్లీ చోరీ కోసం జమ్మికుంటకు వచ్చిన దొంగను గాంధీచౌరస్తాలో అదుపులోకి తీసుకున్నారు. అతడి దగ్గరి నుంచి జమ్మికుంట చోరికి సంబంధించి రూ.80వేల విలువ గల పుస్తెలు తాడు, హైదరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీకి సంబంధించి తులంన్నర బంగారం స్వాధీనం చేసుకున్నారు. అల్లెపుకృష్ణపై జమ్మికుంటలో మూడుకేసులు, హుజూరాబాద్‌లో మూడుకేసులు, కరీంనగర్‌లో 10కేసులు, రాష్ట్ర వ్యాప్తంగా 85కేసులు నమోదై ఉన్నాయి. రెండుసార్లు పీడీయాక్ట్ కేసుల్లో నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. అయిన అతడిలో ఎలాంటి మార్పు రాలేదు. అతడిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించి నట్లు పోలీసులు తెలిపారు. ఇలాంటి దొంగల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. చాకచక్యంగా వ్యవహరించి దొంగను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంగాధర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండల ప్రధాన రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. వారివివరాల ప్రకారం.. కోనరావుపేట మామిడిపల్లికి చెందిన ఐలయ్య ద్విచక్రవాహనంపై గంగాధర వస్తున్నాడు. గంగాధర నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు ఐలయ్య వాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో కాలు, చేతులు విరిగిఐలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కరీంనగర్ తరలించగా ప్రస్తుతం ప్రవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదవిషయాన్ని స్థానికులుపోలీసులకుసమాచారం అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శాయంపేట గ్రామానికిచెందిన మడికొండ శ్రీనివాస్ రావు (42) గడ్డిమందుతాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ శుక్రవారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్‌రావు ఎనిమిది సంవత్సరాల క్రితం తనసొంత ట్రాక్టర్ నడుపుతుండగా యాక్సిడెంట్ చేయడంతో ఓవ్యక్తి మృతిచెందాడు. ఖర్చుల నిమిత్తం ట్రాక్టర్, భూమి అమ్మేశాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసవడంతో ఆరోగ్యం క్షీణించింది. ఈనెల15న గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎమ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడి భార్యలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గ్రావిటీ కెనాల్‌లో పడి యువకుడి గల్లంతు

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన పురాణం సాగర్(32) అనే యువకుడు గ్రావిటీకెనాల్‌లో పడి గల్లంతైనట్లు తెలిసింది.. కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధానరహదారిలో గల రామడుగు రైతు వేదికవద్ద గ్రావిటీ కెనాల్‌లోసాగర్ శుక్రవారం రాత్రిపడ్డట్లు గ్రామస్థులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జల్సాల కోసం చోరీలు

● పోలీసులకు చిక్కిన యువకులు



ముస్తాబాద్ ఠాణాలో దొంగల అరెస్టు చూపుతున్న సీఐ మొగిలి

ముస్తాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం చోరీకి పాల్పడిన యువకులు పోలీసులకు దొరికి జైలుకు వెళ్లిన సంఘటన ముస్తాబాద్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మొగిలి తెలిపినవివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని శుభోదయ మండల సమాఖ్య నుంచి ఒక ఐచర్ ట్రాక్టర్, కుట్టు మిషన్‌ను గత ఫిబ్రవరిలో గుర్తుతెలియని దొంగలు ఎత్తుకె ళ్లారు. సమాఖ్య అధ్యక్షురాలు అల్వాల దేవిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. వాటిని ఎత్తుకెళ్లిన దొంగల కాల్‌డాటా, సీఆర్ఆర్ డంప్స్ ఆధారంగా నిందితులను గుర్తించారు. పక్కా సమాచారం మేరకు కుట్టు మిషన్ ఎత్తుకెళ్లిన ముస్తాబాద్‌కు చెందిన మహ్మద్ షాదుల్లా, దావిరెడ్డి నరేందర్‌రెడ్డితోపాటు సిద్దిపేటకు చెందిన మహ్మద్ సమీర్‌ను అరెస్టు చేశారు. వారివద్ద ఉన్న రూ.6లక్షల ఐచర్ ట్రాక్టర్‌తోపాటు కుట్టు మిషన్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అలాగే వారివద్ద ఉన్న మోటర్‌సైకిల్, ఇండికా కార్, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా రావురూకుల గ్రామానికి చెందిన మల్లేశం పరారీలో ఉన్నట్లు వివరించారు. జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు చేస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న ఎస్‌ఐ సీహెచ్ గణేశ్, హెచ్‌సీలు బాల్‌నర్సయ్య, పీసీలు రాజశేఖర్, ఖాసీంలను సీఐ మొగిలి అభినందించారు.

చెరువులో పడి బాలుడి గల్లంతు



రాజేష్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో పశువుల కాపరికి సహాయకుడిగా వెళ్లిన పుట్ట రాజేష్(13) అనేబాలుడు చెరువులో పడి శుక్రవారం గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పుట్ట పోశెట్టి పశువులకాపరిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శుక్రవారం పోశెట్టికి ఇతర పనులు ఉండడంతో గ్రామానికి చెందిన ఓ వృద్ధుడిని పశువులు మేపడానికి పంపాడు. గుడ్ ఫ్రైడే సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో పుట్ట రాజేష్ వృద్ధుడి వెంట సహాయకుడిగా గ్రామశివారులోకి వెళ్లాడు. సాయంత్రం పశువులను ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో గ్రామ శివారులో ప్రమాదవశాత్తు పెద్దచెరువులో కాలుజారి పడి గల్లంతుయ్యాడు. చెరువులో గ్రామస్థులు వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

బారాత్‌లో తల్వార్‌తో హంగామా

● నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జవారిపేట గ్రామానికి చెందిన గౌరవేని శ్రీకాంత్ అనే యువకుడు తల్వార్‌తో బెదిరించడంతో అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. ఎక్స్‌కావేటర్ నడుపుకుంటూ జీవించే శ్రీకాంత్ ఈనెల16న జవారిపేటలో జరిగిన పెళ్లి బరాత్‌లో తల్వార్‌తో బెదిరింపులకు గురిచేయడమే కాకుండా అడ్డు చెప్పిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. అనంతరం గ్రామం నుంచి వెళ్లిపోయాడు. శుక్రవారం తాళ్లపెల్లి సమీపంలో పట్టుబడినట్లు తెలిపారు. అతడు ప్రయాణిస్తున్న వాహనంలో సోదాచేయగా తల్వార్‌తో పాటు కత్తి లభించినట్లు తెలిపారు. శ్రీకాంత్‌ను విచారించగా డ్రైవర్‌గా వచ్చిన డబ్బులు సరిపోవడం లేదని ఆరు నెలల క్రితం గురుద్వార్ వెళ్లినప్పుడు తల్వార్, కత్తిని కొనుగోలు చేసి తీసుకవచ్చానని తెలిపాడు. ఇతడిపై ఇప్పటికే ఏడు కేసులు ఉన్నట్లు తెలిపారు. కానిస్టేబుల్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి అతని నుంచి థార్ వాహనాన్ని, తల్వార్, కత్తిని సీజ్ చేసినట్లు తెలిపారు.

శాంతినగర్‌లో వ్యక్తి ఆత్మహత్య


జ్యోతినగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో బండ మోహన్(35) గురువారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని సంతోష్‌నగర్‌కుచెందిన మోహన్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎలక్ట్రిషియన్‌గా పనిచేస్తున్నాడు. శాంతినగర్‌లో ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో ఉంటున్నాడు. ఈక్రమంలో గురువారంరాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చిన మోహన్‌భార్యతో గొడవపడ్డాడు. తాగినమత్తులో భార్య, ఇద్దరుపిల్లలను కొట్టి తనగదిలోకివెళ్లి చున్నీతోసీలింగ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడిఅన్న బండ రవి ఫిర్యాదు మేరకుకేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ తెలిపారు.

హైదరాబాద్ రోడ్డు ప్రమాదంలో బోర్నపల్లి వాసి మృతి

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలప్రకారం.. బోర్నపల్లికి చెందిన కుతాడి జీవన్(23) హైదరాబాద్‌లో స్విగ్గీ డెలివరీ బాయ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వృత్తిలో భాగంగా డెలివరీ ఇవ్వ డానికి వెళ్తుండగా మణికొండ వద్ద కారు ఢీకొంది. అనంతరం లారీ కింద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జీవన్ మృతిచెందడంతో బోర్నపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థిని ప్రతిభ..

● చిత్రలేఖనం, సంగీతంలో రాణిస్తున్న విద్యార్థిని ● పలువురి ప్రశంసలు అందుకుంటున్న అర్చన



అర్చన గీసిన చిత్రాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారి పెన్సిల్ పట్టుకుంటే.. అందమైన చిత్రం కాగితంపై ఆవిష్కృతం అవుతుంది. సమయం దొరికినప్పుడల్లా కళకు జీవం పోస్తుంది. చిత్రలేఖనంతోపాటు సంగీతంలోనూ ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలందుకుంటోంది ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన విద్యార్థిని రామ అర్చన.

చిన్నతనం నుంచే చిత్రలేఖనంపై ఆసక్తి..

మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన రామ కృష్ణవేణి-దామోదర్ దంపతులకు ఇద్దరు కూతుళ్ల అర్చన, శ్రావ్యలు. పెద్ద కూతురు అర్చన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచే కాగితాలపై చిత్రాలు గీయడం అలవాటు చేసుకుంది. ఖాళీ సమయాల్లో చిత్రాలు గీస్తూ ప్రతిభను చాటుకుంటోంది. తల్లిదండ్రులు ఆమె ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతో మరింతా ముందుకు సాగుతోంది. రాధాకృష్ణులు, శివుడు, మహిళలు బతుకమ్మ ఆడడం తదితర చిత్రాలు అబ్బురపరుస్తున్నాయి.

సంగీతంలోనూ ప్రావీణ్యం..

చిత్రలేఖనంతో పాటు సంగీతంలోనూ అర్చన రాణిస్తోంది. దేశభక్తి, సినీ గేయాలు క్యాషియోపై వాయిస్తూ ఆశ్చర్యపరుస్తోంది. పాఠశాల వార్షికోత్సవంలో ప్రతిభను చాటుకుని పలువురి ప్రశంసలందుకుంది.



క్యాషియో వాయిస్తున్న అర్చన

మ్యూజిక్ డైరెక్టర్‌నవుతా..: విద్యార్థిని అర్చన

భవిష్యత్తులో ఆర్టిస్ట్‌తోపాటు మ్యూజిక్ డైరెక్టర్ కావాలనేది నా లక్ష్యం. నేను గీసిన చిత్రాలు ప్రదర్శనగా ఉంచి అందరి చేత ప్రశంసలు అందుకోవాలని నా కోరిక.



మామిడి, అల్లనేరేడు చెట్లకు చేసిన అలంకారం

మామిడి చెట్లకు కల్యాణం

● ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివ పార్వతుల కల్యాణం

కథలాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని గంబీర్‌పూర్‌లో శుక్రవారం ముదిరాజ్ సంఘ సభ్యులు తమ ఎనిమిది ఎకరాల మామిడి తోటకు వివాహం జరిపారు. తోటను సాగు చేసుకుని ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా శివుడు(అల్లనేరేడు), పార్వతి (మామిడి) చెట్లను శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పండితులు మాధవాచార్యులు వేద మంత్రోచ్చరణల మధ్య సంఘ సభ్యులు కల్యాణం జరిపారు. ఐదేళ్లకు కాత వచ్చే దశ కావడం వల్ల అధిక దిగుబడి రావాలనే ఉద్దేశ్యంతో పెళ్లి జరిపించామని సంఘ సభ్యులు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో దాసరి గంగాధర్, గండి రవి, కొండగట్టు, గండి తిరుపతి, సంఘ సభ్యులు ఉన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న ముదిరాజ్ సంఘ సభ్యులు

యువకుడి అదృశ్యం



గణేష్ (ఫైల్)

గొల్లపల్లి ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన చిట్యాల గణేష్ (19) గురువారం నుంచి కనిపించడం లేదని వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు గొల్లపల్లి ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్, వారి కుటుంబ సభ్యులకు తెలపాలని కోరారు.



ఆచీతూచి

ఇంటర్ తర్వాత కోర్సుల ఎంపికే కీలకం

మూడు, నాలుగేళ్లు కష్టపడితే జీవితం ఆనందమయం

అడుగు వేయాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల ఫలితలు కొన్ని రోజుల్లో వెలువడనున్నాయి. తరువాత ఏం చదవాలి, ఏరంగంలో స్థిరపడాలనే సందేహాలు విద్యార్థుల మెదడులో మెదులుతూ ఉంటాయి. దీనికి తల్లిదండ్రుల ఒత్తిడి, వివిధ కళాశాల పీఆర్వోల హంగామా తోడైంది. ఇంటర్ తర్వత చదివే కోర్సులే జీవితాన్ని మలుపు తిప్పుతాయి. డాక్టర్, ఇంజనీరింగ్, శాస్త్రవేత, చార్టర్ అకౌంటెంట్, బ్యాంకు ఉద్యోగులు,వివిధ ప్రభుత్వకొలువులు ఇలా అనేక అవకాశాలు ఊరిస్తూ ఉంటాయి. దీంతో విద్యార్థి ఊగిసలాడుతూ ఉంటారు. నిర్దిష్ట ఆలోచన, విద్యార్థి అభిరుచి, అసక్తే ఇక్కడ కీలకం. విద్యార్థికి ఆసక్తి, అభిరుచి ఉన్న కోర్సు ఎంపిక చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. ఇంటర్ విద్యార్థుల కోసం ప్రత్యేక కథనం..

● డీఎడ్ ప్రాథమిక బోధన..

ఉపాధ్యాయ వృత్తిపై మక్కువ ఉంటే రెండేళ్ల డీఎడ్ కోర్సులో చేరవచ్చు. జిల్లాలో ఇలాంటి కళాశాలలు ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉన్నాయి. డీఎడ్ కామన్ ఎంట్రన్స్ పరీక్షతో సీటు లభిస్తుంది. అతి త్వరలోనే ఒక ప్రభుత్వ ప్రకటన వెలువడుతుంది.

● ఉపాధితోనూ సేవ చేయాలనుకుంటే...

బైపీసీ విద్యార్థులకు బీఎస్సీ నర్సింగ్ ఒక చక్కని అవకాశం. ఉపాధి పొందుతూ పేదలకు సేవ చేసేందుకు ఈ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంటర్ తర్వాత నాలుగేళ్ల కోర్సును ఎంపిక చేసుకుంటే ఆపై వెంటనే ఉద్యోగం లభిస్తుంది. రెండేళ్ల ఫిజియో థెరపీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

● సీఏతో ఉన్నత హోదా

దేశ ఆర్థిక వ్యవహారాల్లో పర్యవేక్షణ, నియంత్రికకు సీఏ కోర్సు దోహదపడుతుంది. ఇంటర్ తర్వాత సీపీటీ ప్రవేశ పరీక్ష ఉంటుంది. అర్హత సాధించి ఐపీసీసీలో చేరవచ్చు. నాలుగున్నరేళ్ల చదివితే సమాజంలో ఉన్నత హోదాలో కొనసాగే అవకాశం ఉంటుంది.

● ఇంజనీరింగ్..

ఎప్‌సెట్లో ఇంజనీరింగ్ కోర్సులకు ప్రాధాన్యం అధికం. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఇంజనీరింగ్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్, ఐటీ, ఈఈఈ, వంటి కోర్సులు ఉన్నాయి. ఆసక్తి ఉంటే దేంట్లోనైనా రాణించే అవకాశం ఉంటుంది.

● వ్యవసాయం, ఉద్యానవనం

ఎప్‌సెట్‌తోనే బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్(బై పీసీ విద్యార్థులకు) చదివే అవకాశం ఉంటుంది. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ ఆపై పీజీ తరువాత పరిశోధన వైపు అడుగులు వేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

● న్యాయ వృత్తి...

ఇంటర్ తర్వాత ఐదేళ్ల న్యాయవిద్య కోర్సు ఉంది. లాసెట్‌తో ప్రవేశాలు జరుగుతాయి. స్థిరపడేందుకు ఎక్కువ సమయం తీసుకున్నా ఉపాధికి మాత్రం బాగుంటుంది. న్యాయవాదిగా వ్యాపార సంస్థలు న్యాయ సలహాదారులుగా రాణించవచ్చు.

● సాంప్రదాయ కోర్సులు

బీకాం జనరల్, కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉంది. బీఎస్సీలోనూ అనేక కాంపిటేషన్ కోర్సులున్నాయి. వీటిలో ఏదో ఒకటి ఎంచుకోవచ్చు.

● ఐఐటీతో సాంకేతిక విద్య

ఇంజనీరింగ్ విద్యపై ఆసక్తి ఉన్నత విద్యా సంస్థల్లో అభ్యసించాలనే వారికి ఐఐటీ ఎంతో ప్రయోజనకరం. ఇవి ఆఫర్ చేసే కోర్సుల్లో విద్యార్థులు వారి అభి రుచికి తగినవి ఎంచుకోవాలి.

● వైద్యమే ఆరాధ్యమైతే...


వైద్యవృత్తిపై ఆసక్తి ఉంటే ఎంబీబీఎస్ కోర్సు ఉత్తమం. నీట్‌లో వచ్చిన ర్యాంకు ఆధారంగా కళాశాలల్లో సీటు లభిస్తుంది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్, మెడికల్ ఆఫీసర్, వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సొంతంగా ఆస్పత్రి ఏర్పాటు చేసుకోవచ్చు. ఎంబీబీఎస్‌లో సీటు రాకుంటే బీడీఎస్ చేరవచ్చు.

● ఫార్మసీకి ప్రాధాన్యం....

ఔషధరంగ పరిశోధన, అభివృద్ధి రంగాల్లో ఫార్మసీ విద్యార్థులకు అవకాశాలు విస్తృతంగా ఉంటున్నాయి. ఎంసెట్‌తోనే బీఫార్మసీ ప్రవేశాలు జరుగుతున్నాయి. ఇది పూర్తి చేసిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్, టెక్నికల్ ఆఫీసర్, ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులుగా ఉదోగ్యాలు లభిస్తాయి.

నచ్చిన కోర్సులు ఎంపిక చేసుకోండి

తల్లిదండ్రులు చెప్పారని, స్నేహితులు తీసుకున్నారని ఏ కోర్సులోనూ చేరవద్దు. మార్కెట్లో డిమాండ్ కంటే మనస్సు డిమాండ్‌కే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆసక్తి ఉన్న కోర్సులో చేరితే జీవితంలో అత్యున్నత స్థాయికి చేరవచ్చు. పట్టుదల ఉంటేనే ఏ కోర్సులోనైనా రాణించవచ్చు. ఇంజనీరింగ్ విద్య పూర్తి చేసిన వారిలో ప్రతి 100 మందిలో 60 మందికి స్కిల్స్ లేవని కంపెనీలు తిరస్కరిస్తున్నాయి. ఆ జాబితాలో మీరు లేకుండా చూసుకోవాలి. తల్లిదండ్రులు మార్గదర్శనం చేయాలి తప్ప నిర్దేశం కాదు. ఇష్టమైన కోర్సులో పిల్లలను చేరనీయాలి. అందులో రాణించేలా ప్రోత్సాహం ఇవ్వాలి.




జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్



విశృత్‌ను సన్మానిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరగనున్న 54వ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు జిల్లాకు చెందిన కేంద్రీ య విద్యాలయ విద్యార్థి తాటి విశృత్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ హకీంపేట ఎయిర్ ఫోర్స్ అకాడమీ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 54వ రీజనల్ స్కేటింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన విశృత్ మూడు విభాగాల్లో పాల్గొని ఒక బంగారు, రెండు రజత పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జాతీయ పోటీలకు ఎంపికైన విశృత్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అభినందించి శాలువాతో సత్క రించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశృత్ మున్ముందు జరిగే జాతీయ పోటీల్లో విశేష ప్రతిభచాటి రాష్ట్ర క్రీడా పతాకాన్ని ఎగురవేయాలని అన్నారు. విశృత్ గెలుపొందినందుకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఫోన్ ద్వారా ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ పంకజ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ వామన్‌రావు, పీఈటీ వివేక్, స్కేటింగ్ కోచ్ గట్టు అనిల్ కుమార్‌గౌడ్, హరి పాల్గొన్నారు.



మానవ శరీరంలో కీలకం

నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం



సుభాష్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన అవయవం కాలేయం. కాలేయం జీవక్రియ, జీర్ణక్రియ, రోగ నిరోధక శక్తి, విష పదార్థాల వడపోత, విటమిటన్లు, ఖనిజాలు, గ్లూకోజు నిల్వ వంటి అనేక విధులను నిర్వహిస్తుంది. కాలేయం స్వీయ స్వస్థత ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా సంవత్సరానికి 20 లక్షల మంది కాలేయ వ్యాధుల వల్ల మరణిస్తున్నారు. మద్యం సేవించే వారిలో 7.5 శాతం నుంచి 10 శాతం మంది కాలేయ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. ఊబకా యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా ఈ వ్యాధుల బారిన పడే అవ కాశం ఉంది. ఏటా కొత్త కేసుల్లో 35శాతం పెరుగుదల ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు.

● అవగాహన లేక పోవడంతో....

వ్యాధి తీవ్రత సంబంధిత ప్రమాద కారకాలు, నివారణ గురించి ప్రజల్లో అవగాహన లేక పోవడంతో వ్యాధి బాధితులు పెరుగుతున్నారు. ప్రొటీన్, ఫైబర్ అధికంగా ఉండే సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానం చేస్తే కాలేయ వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చు. మద్యం, ధూమపానం పూర్తిగా మానుకోవాలి.

● జంక్ ఫుడ్‌తో చాలా ప్రమాదం... డాక్టర్ ప్రణీత్, మెడికవర్ హాస్పిటల్ కరీంనగర్



గతంలో మద్యపానం చేసేవారికి మాత్రమే కాలేయం చెడిపోయేది. మారుతున్న జీవనశైలితో ప్రస్తుతం జంక్‌ఫుడ్‌తో ఫ్యాటీ లీవర్ ఎక్కువగా వస్తుంది. మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, కలుషిత నీరు, ఆహారంతో హెపటైటీస్ ఏ అనే వైరస్ వస్తుంది. దీంతో పచ్చ కామెర్లు వంటివి వస్తున్నాయి. డ్రగ్ అడిక్షన్, ఇతరులకు వాడిన నిడిల్‌తో హెపటైటీస్ బీ, సీ వస్తాయి. పాశ్చాత్య పోకడల వల్ల నేటి యువత జంక్ ఫుడ్‌కు అలవాటు పడిపోతున్నారు. దీంతో 60లో రావలసిన వ్యాధులు 30లో వస్తున్నాయి.

● ఈ సంవత్సర థీమ్...

ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏప్రిల్ 19న కాలేయ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ సంవత్సరం థీమ్ 'ఆహారమే ఔషధం'. ఈ థీమ్ సమతుల్య ఆహారం ద్వారా కాలేయ వ్యాధులను నివారించడంలో పోషకాహారం కీలక పాత్రను చెబుతోంది.

తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసు

పెద్దపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తప్పుడు దస్తావేజులు సమర్పించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని పెద్దపల్లి తహసీల్దార్ డీ రాజయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి భూంనగర్‌లోని సర్వే నంబర్ 694లో ఉన్న 309చదరపు గజాల భూమి ఠాకూర్ శంకర్ సింగ్ 2009లో కొనుగోలు చేశారు. ఆయన మరణం తర్వాత కూతురు ఠాకూర్ మధుమిత, తల్లి ఠాకూర్ శ్యామల తాము మాత్రమే హక్కుదారులమని తప్పుడు పత్రాలు చూపించి, కుమారుడు ఠాకూర్ అభిలాష్ ఉన్నట్లు మార్చి రిలీజ్ రైట్స్ డీడ్ పొందారని తెలిపారు. ఠాకూర్ అభిలాష్ సైతం అప్పటి కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషోర్ బాబుతో కుమ్మక్కై అతని తల్లి శ్యామల చనిపోయినట్లుగా తప్పుడు డెత్ సర్టిఫికెట్‌ను సృష్టించి సదరు భూమిని ఠాకూర్ సాయి సంతోష్‌కు పెద్దపల్లి సబ్ రిజిస్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ విక్రయించారని అన్నారు. ప్రభుత్వ అధికారు లను తప్పుదోవ పట్టించినందుకుగాను ఠాకూర్ శంకర్ సింగ్ కుమార్తె ఠాకూర్ మధుమిత ఏ1, భార్య ఠాకూర్ శ్యామల ఏ2, కుమా రుడు ఠాకూర్ అభిలాష్ ఏ3, ఠాకూర్ సాయి సంతోష్ ఏ4, ప్రస్తుతం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో గ్రామపంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కిషోర్ బాబు ఏ5గా పోలీసులు ఐపీసీ 420, 409, 464, 467 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని పెద్దపల్లి తహసీల్దార్ పేర్కొన్నారు.

అదుపు తప్పి కారు బోల్తా

ముగ్గురికి గాయాలు

కొడిమ్యాల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల క్రాస్ రోడ్డు నుంచి దొంగలమర్రి బస్ స్టేజీ వైపు వెళ్తున్న కారు శుక్రవారం అదుపు తప్పి పక్కన ఉన్న కందకంలో బోల్తా పడింది. హైదరాబాదు నుంచి కారులో సుమారు పది మందితో వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనం చేసుకొని కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్తుండగా కారు అదుపు తప్పి బోల్తా పడినట్లు తెలిసింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. గాయాల పాలైన వారిని చికిత్స నిమ్మిత్తం జగిత్యాల ఆసుపత్రికి 108 వాహనంలో సిబ్బంది తరలించారు. ఈ విషయమై కొడిమ్యాల ఎస్సై సందీప్‌ను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామానికి చెందిన అరెల్లి అజయ్ (22) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అజయ్ తల్లి పద్మ కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధ పడుతూ చికిత్స పొందుతోంది. దీంతో మనస్తాపం చెందిన అజయ్ గురువారం తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా గమనించిన తండ్రి వెంకటి స్థానికుల సహాయంతో చికిత్స నిమిత్తం కోరుట్లకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం జగిత్యాల తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. అజయ్ తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏటీఎంలలో చోరీకి పాల్పడుతున్న వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పెద్దపల్లి డీసీపీ కరుణాకర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి ఏటీఎంల్లో దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పెద్దపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ కార్యాలయంలో డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం అల్వార్ జిల్లాకు చెందిన అన్నదమ్ములు సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మరో నలుగురు ఆరీప్‌గుటారి, ఆష్ మహ్మద్, సాహిల్, ఇమ్రాన్ ముఠాగా ఏర్పడి ఏటీఎమ్‌ల వద్ద దోడిడీకి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏటీఎంలో దోపిడీకి పాల్పడి వాటాలు పంచకుంటుండగా వివాదాలు తలెత్తి విడిపోయారు. సిద్ధిక్‌ఖాన్, ఆరీఫ్‌ఖాన్ మాత్రం తెలంగాణకు చేరుకొని వివిధ ప్రాంతాల్లో దోపిడీకి పాల్పడ్డారు.

ఈ నెల 15న ఉదయం పెద్దపల్లిలోని కునారం రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎమ్ వద్ద దోచుకునేందుకు సిద్ధమయ్యారు. అనుకున్న ప్రకారం వెంట తెచ్చుకున్న ఓ పరికరాన్ని ఏటీఎంలో అమర్చి ప్లాస్టర్ వేసి ఉంచారు. పట్టణంలోని శాంతి నగర్‌కు చెందిన పుట్ట శివకుమార్ ఐదు వందల రూపాయలు డ్రా చేసేందుకు ఏటీఎమ్ ఆపరేట్ చేశాడు. మిషన్ నుంచి డబ్బులు బయటకు రాకపోవడంతో డబ్బులు లేవనుకొని వెళ్లిపోయాడు. వెంటనే సిద్ధిఖ్, ఆరీఫ్‌లు ఎటీఎమ్‌లో అమర్చిన టీ ఆకారపు పరికరాన్ని తొలగించి ఐదు వందలు తీసుకున్నారు. శివకుమార్ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు కట్ అయ్యాయి. ముంబాయి సెక్యూరిటీ విభాగం నుంచి పెద్దపల్లి బ్రాంచీకి ఏటీఎమ్ తెరిచిన సమాచారాన్ని అందించారు. బ్యాంకు సిబ్బంది చుట్టపక్కల వెతికే సరికి ఎవరు లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెద్దపల్లిలో ఎస్‌బీఐ ఏటీఎంల్లో అమర్చిన హెట్రో కంపెనీ మిషన్లను వెతికారు. లేకపోవడంతో కాగజ్‌నగర్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్ వచ్చారు. పోలీసులు సీసీ కెమరాల ఫుటేజీల ఆధారంగా రైల్వేస్టేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. అయితే ఇలా అన్ని ప్రాంతాల్లో హెట్రో కంపెనీ ఏటీఎమ్‌లను టార్గెట్ చేస్తూ వెంట తెచ్చుకున్న పరికరాలతో డబ్బులు తీసుకుంటున్నారని తెలిపారు. ఇంకా పెద్ద ఎత్తున నగదు నష్ట పోకుండా అరికట్టిన సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేష్ సిబ్బందిని అభినందించి రివార్డులు అందజేశారు. నిందితుల నుంచి టీ పరికరం ప్లాస్టర్లు, రేకు ముక్కలు, కట్టర్, రెండు సెల్ ఫోన్లు, ఐదు వందల నోట్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచనున్నట్లు డీసీపీ తెలిపారు. ఆయన వెంట ఏసీపీ గజ్జి కృష్ణ ఉన్నారు.

జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉమ్మడి జిల్లాకు చెందిన జైనపురం నాగరాజు, కల్లెపల్లి చక్రధర్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వడ్లూరి రాజేందర్, జిట్టబోయిన శ్రీను తెలిపారు. వీరు ఈ నెల 19 నుంచి 23 వరకు బీహార్ రాష్ట్రంలో జరిగే 47వ జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తెలంగాణ చైర్మన్ జగన్మోహన్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ రెడ్డి, విష్ణువర్ధన్ తెలిపారు. వీరిని మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ బొమ్మరవేని తిరుమల తిరుపతి, ట్రెజరర్ కలిగేటి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి జెట్టిపల్లి అశోక్, సభ్యులు అనూప్ రెడ్డి, ఇతరవేని శ్రీనివాస్, భాస్కర్, రాజ్ కుమార్, మహేష్, లింగారావు అభినందించారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం



ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయం శుక్రవారం భక్తజన సంద్రంగా మారింది. విద్యార్థులకు సెలవు రోజులు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రాజన్న దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించారు. ధర్మదర్శనం, కోడె మొక్కు క్యూలైన్‌లో సుమారు రెండు గంటలపాటు బారులు తీరిన భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు, సూపరిండెంట్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హైందవ భక్తికళా సమ్మేళనం విజయవంతం చేయాలి..

హౌదవ భక్తి కళా సమ్మేళనం నిర్వహించే సభను విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ పిలుపునిచ్చారు. వేములవాడ రాజన్న ఆలయ ఆవరణలో విజయశంకర్ స్వామితో కలిసి శుక్రవారం హైందవ భక్తి కళా సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ మే 7వ తేదిన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో నిర్వహించే సభకు పెద్ద ఎత్తున హిందువులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

● న్యూస్‌బాక్స్

నేడు 'వారధి' కథా సంకలనం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో కథా రచయిత కటకోజ్వల మనోహరాచారి రచించిన 'వారధి' కథా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలల రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జీవి శ్యాంప్రసాద్‌లాల్ హాజరవుతారని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటారాలజిస్టు డాక్టర్ జయంత్ మూడే, న్యూరో సర్జన్ డాక్టర్ అనంత్ పాల్గొన్నారు. దీర్ఘకాలిక జీర్ణకోశ సంబంధిత సమస్యలు, కాలేయ సమస్యలను తెలుసుకున్నారు. మెదడు, వెన్నుముక, నరాల వ్యాధులకు సంబంధించి మెదడులో గడ్డలు, రక్తస్రావం, చీముగడ్డలు, పక్షవాతం, తలకు గాయం, తలనొప్పి, పార్కిన్సన్స్, ఫిట్స్ వ్యాధులకు, డిస్క్ సమస్యలకు సంబంధించి సలహాలు సూచనలు చేశారు.

బీమా రక్షణే ఎల్ఐసీ లక్ష్యం

భగత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రజలకు బీమా రక్షణ కల్పించడమే భారతీయ జీవిత బీమా లక్ష్యమని ఎల్ఐసి వికాసాధికారి (డిఓ/ఎస్‌బిఏ) అన్నారు. శుక్రవారం నగరంలో ఎల్ఐసి పాలసీలపై ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఆర్థిక స్థితిని బట్టి వారి అవసరాలను తమ సంస్థ ప్లాన్స్‌ను అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలోజంగం తిరుపతియాదవ్,కోట సత్యం, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి దేవాలయం సందర్శన

కరీంనగర్ రూరల్ , ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయాన్ని శుక్రవారం శ్రీమాన్ తాళ్లపాక స్వామిజీ (12 అవతారం అన్నమయ్య వారసులు) సతీసమేతంగా దర్శించుకున్నారు. శంకరునికి రుద్రాభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి మహత్యం భగవద్గీత గురించి ఉపదేశములు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి దేవరాజ్ శర్మ, చిగురాల మధుసూదనాచార్యులు, మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర విజయవంతం

● సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర విజయవంతమైందని యాత్రకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించిందని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భగత్‌నగర్ భగత్‌సింగ్ కూడలి నుంచి ప్రారంభమైన పాదయాత్ర డివిజన్‌ల మీదుగా కొనసాగింది. అందరితో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ, అంబేద్కర్, రాజ్యాంగం గురించి సూర్యచంద్రులున్నంత వరకు ప్రజలు తెలుసుకుంటూనే ఉంటారన్నారు. ఈ పాదయాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయి పాదయాత్ర ముగింపు విజయవంత సభ జరుగుతుందని, ఆ తర్వాత అన్ని నియోజకవర్గాల వారితో కరీంనగర్ జిల్లాసభ, చివరగా హైదరా బాదులో అన్ని జిల్లాల వారితో రాష్ట్రసభ జరుగుతుందని తెలిపారు. ఈ పాద యాత్రలో నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, దన్న సింగ్, గడ్డం విలాస్‌రెడ్డి, ఆకుల నర్సయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్‌సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్, ఎస్‌టీ సెల్ అధ్యక్షులు శ్రవణ్‌నాయక్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, వాడే వెంకటరెడ్డి, నెల్లి నర్సయ్య, రమణారెడ్డి, ములుగు ప్రకాష్, నయీమ్, అబ్దుల్ రహమాన్, లయీక్, పోరండ్ల రమేష్, వరప్రసాద్, నాగుల సతీష్, వంగల విద్యాసాగర్ పాల్గొన్నారు.



రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నాగుల మల్యాలలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

భగత్‌నగర్: కొత్తపల్లి మండలంలోని నాగుల మల్యాల, కొత్త కొండాపూర్ గ్రామాలలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాగుల మల్యాలలో సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులు అందించారు. రాజాగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండల కో-ఆర్డినేటర్ సత్య ప్రసన్న, పార్టీ మండల అధ్యక్షుడు పంజాల స్వామి గౌడ్, లస్మయ్య, మడుపు మోహన్ పాల్గొన్నారు.

కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన

కరీంనగర్‌టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండ లంలో ఏర్పాటు చేసిన కళాసిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు భారీ స్పందన వస్తోంది.పది రాష్ట్రాల్లో తయారు చేసిన చేనేత దుస్తుల అమ్మకాలతో పాటు స్టోన్, జువెల్లరీస్, కుర్తా, డ్రెస్ మెటీరియల్, డోర్ కర్టన్స్, పెరల్స్, ఉడెన్ హ్యాండ్ క్రాఫ్ట్స్, బంజారా కోల్‌కత్తా బ్యాగ్స్, జూపూరి రాంజి, ఒరిస్సా హ్యాండ్ క్రాఫ్ట్ వస్తువులు ప్రదర్శ నలో లభిస్తాయని ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



చేనేత హస్తకళా ప్రదర్శనలో కొనుగోళ్లు చేస్తున్న మహిళలు

మానకొండూర్ సీఐగా సంజీవ్

మానకొండూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా బి సంజీవ్ వరంగల్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మీనారాయణ మల్టీజోన్-1 హైదరాబాద్‌కు గురువారం అర్ధరాత్రి బదిలీ ఉత్తర్వులు వెలుబడ్డాయి. ఏడాదిలో ఇద్దరు సీఐలు సదన్‌కుమార్, లక్ష్మీనారాయణ బదిలీ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వానికి రైతుల గోస పట్టదా?

-బోయినపల్లి ప్రవీణ్‌రావు

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారని, కోతుల బెడద, అకాల వర్షాల నుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు గోస పడుతుఅన్న ప్రభుత్వానికి పట్టదా అని బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ప్రశ్నించారు. రామడుగులో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో సంఘటన్ సంరచన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, మాజీ మండలశాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి, ఉప్పు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో రైతుల కోసం ఎన్నో పథకాలు

● ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలం దుర్శేడ్ సహకార సంఘం ఆధ్వర్యంలో దుర్శేడ్, మొగ్దుంపూర్, జూబ్లీనగర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో, కరీంనగర్ సహకారం సంఘం ఆధ్వర్యంలో చెర్లబూత్కూర్, నగునూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి , ఎమ్మెల్యే గంగుల కమలార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. గతంలో రైతులకు చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీరు విడుదలైతే కరీంనగర్ మండలం చివరి ఆయకట్టు వరకు నీరందుతుందన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంగనర్, దుర్శేడ్ సహకార సంఘం అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, తోట తిరుపతి ఉన్నారు.



చెర్లబూత్కూర్‌లో కొనుగోళ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల

'మానేరు రివర్‌ఫ్రంట్ అవకతవకలపై ప్రభుత్వానికి పట్టింపులేదు'

భగత్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులో అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మేయర్ సునీల్‌రావు ప్రశ్నించారు. శుక్రవారం మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెనను బీజేపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 546 కోట్లతో మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. ఇప్పటి వరకు 226 కోట్ల రూపాయల పనులు చేసి బిల్లులు తీసుకున్నారన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌లో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలపై ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులపై పూర్తి స్థాయి విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రివర్ ఫ్రంట్‌కోసం రెండు ప్రొటెక్షన్ వాల్స్ కట్టి పూర్తి స్థాయిలో బండరాళ్లు తొలగించకుండా 30కోట్ల బిల్లులు తీసుకున్నారన్నారు. క్రషర్, రిబిట్‌మెంట్ డస్టుగా మార్చి అక్రమంగా వాడుకున్నారన్నారు. మానేరు డ్యాంలోని మట్టి తవ్వి 55కోట్ల బిల్లులు రికార్డు చేసి చెల్లించారన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై బిల్లులు తీసుకున్నారన్నారు. మానేరు రివర్‌ఫ్రంట్‌లో జరిగిన పనులపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దండకారణ్యంలో దాడులు ఆపాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో ఆదివాసీలపై దాడులు ఆపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, టి రత్నకుమార్, బొడ్డుపెల్లి రవి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 20న బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆదివాసీ హక్కుల సంఘీభావ పోరాట వేదిక ఆధ్వర్యం బహిరంగ సభ నిర్వహిచనున్నట్లు తెలిపారు. సమావేశానికి ప్రజలు హాజరుకావాలని కోరారు.

డివిజన్లలో పర్యటించిన డిప్యూటీ కమిషనర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి పర్యటించారు. శుక్రవారం 31, 33, 34, 36, 40 డివిజన్లలో అధికారులు ట్రేడ్ లైసెన్స్ పన్నులు వసూలు చేస్తున్న తీరును పరిశీలించారు. పలు ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన వ్యాపార దుకాణాల కొలతలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్తులు తప్పనిసరిగా నగర పాలక సంస్థ ద్వారా ట్రేడ్ లైసెన్స్ పొందాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఐదు శాతం రాయితీతో ఆస్తి పన్ను చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలన్నారు. ఆర్ఓ భూమానందం, ఆర్ఐ శ్యాంసుందర్, విజయలక్ష్మి, వార్డు ఆఫీసర్స్ బిల్ కలెక్టర్లు సపోర్టింగ్ స్టాఫ్ జవాన్లు పాల్గొన్నారు.

నేడు రూరల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులలో భాగంగా శనివారం ఉదయం 9:30 నుంచి ఉదయం 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, రూరల్ ఏడిఈ గాదం రఘు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు కమాన్‌పూర్ గ్రామం, గ్రానైట్ పరిశ్రమలు, చింతకుంట గ్రామం (పార్టికల్), శ్రీరాంనగర్ (కేఎస్ఆర్),మల్కాపూర్ ఇతర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): అగ్నిమాపకశాఖ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కరీంనగర్ ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఎస్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది కరీంనగర్‌లోని ఎల్‌పీజీ వంటగ్యాస్ సిలిండర్ గోదాంలు, పెట్రోల్‌బంక్‌లలో సిబ్బంది, వినియోగదారులకు అవగాహన కల్పించారు. వంట గ్యాస్‌తో ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయి?గ్యాస్ లీకేజీ అయిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. మంటలు అంటుకున్న సందర్భంలో రక్షణ చర్యలు, మంటలను ఆర్పేందుకు ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. పెట్రోల్ బంక్‌లలో అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం అగ్నిప్రమాదాలపై ఫైర్ సిబ్బంది ప్రదర్శినలిచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది, వంటగ్యాస్ గోదాం, పెట్రోల్‌బంక్ సిబ్బంది పాలొన్నారు.



గ్యాస్‌గోదాం వద్ద అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

నేడు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిరసన

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న హింసను నిరసిస్తూ వీహెచ్‌పి, భజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపనున్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మధుసూదన్‌రావు, ఆదిమూలం విద్యాసాగర్, రాష్ట్ర గోరక్షా కమిటీ మెంబర్ పుట్కూరి రాధాకృష్ణారెడ్డి, నగర అధ్యక్షుడు ఇనుగుర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ద్వారా రాష్ట్రపతికి వినతి పత్రం సమర్పించాలని కోరనున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సుడా పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా చింతకుంటలోని వినాయకనగర్ ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రోడ్డుకు సుడా నిధులతో చేపడుతున్న 15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 23వ డివిజన్‌లో మహిళా కమ్యూనిటీ భవనం, మురికి కాలువ నిర్మాణం, జిమ్ అన్ని కలిపి 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించే పనలు, 9వ డివిజన్‌లో 10 లక్షలతో పద్మశాలి సామాజిక భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమాలలో మడుపు మోహన్, శ్రవణ్‌నాయక్, పిట్టల రవీందర్, మాజీ కార్పొరేటర్ ఆర్ష మల్లేశం, గంగుల దిలీప్, లింగమూర్తి, కంకణాల అనిల్‌కుమార్, పోరండ్ల రమేష్, వంగల శ్రీనివాస్, మాసం రమేష్, స్వప్న పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సుడా చైర్మన్

రైతులకు వరం.. ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మానకొండూర్/తిమ్మాపూర్/శంకరపట్నం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు వరమని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్, తిమ్మాపూర్, శంకరపట్నం మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభు త్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపుకలెక్టర్ లక్ష్మీకిరణ్, తహసీల్దార్ రాజేశ్వరి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ, బండారి రమేష్, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్‌చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు నల్ల గోవిందరెడ్డి, పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపెల్లి తిరుపతి, నాయకులు ఉన్నారు.



మానకొండూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ



చొప్పదండిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

దళారులకు అమ్ముకోవద్దు..

చొప్పదండి: రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకోవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని చొప్పదండి, భూపాలపట్నం, రుక్మాపూర్, కొలిమికుంట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్, మార్కెట్ కార్యదర్శి రాజేశ్వరి, అసిస్టెంట్ రిజిస్టర్ జమున, సివిల్ సప్లై డీటీ ఉష, ఐకేపీ ఏపీఎంనర్మద, రైతులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

హుజూరాబాద్/శంకరపట్నం/గంగాధర/రామడుగు/చొప్పదండి/జమ్మికుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రాల్లోని సీఎస్ఐ చర్చిలలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులు పాటలు పాడి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సిలువ ధ్యానంలో పాల్గొన్నారు. యేసు సిలువపై పలికిన ఏడు మాటలను గుర్తు చేస్తూ పాస్టర్లు వాక్యోపదేశం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. క్రైస్తవ సోదరులు నూతనవస్త్రాలు ధరించి, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఒకరికొకరు ఆలింగనం చేసుకొని సంబరాలు జరిపారు.



జమ్మికుంటలో క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న పాస్టర్

నేడు తడి, పొడి చెత్తపై సైన్స్ ఎగ్జిబిషన్

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో శనివారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

సన్మానం..

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడబ్ల్యూజేఎఫ్ కార్యాలయంలో బీసీ సిటిజన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇటీవల ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి యతిపతి అరుణ్‌కుమార్, ఎ రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చందుపట్ల జనార్దన్, వెంకన్న, రవీందర్, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు

హుజూరాబాద్/సైదాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మండలంలోని మాందాడిపల్లి, సైదాపూర్ మండలంలోని జాగీర్‌పల్లి గ్రామాల్లో పశువులకు ఉచితగాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, సీహెచ్ విజేందర్‌రావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

సైదాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెన్కేపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సింగిల్ విండో అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి శుక్రవారం ప్రాంభించారు. ఈసందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందన్నారు.

మంధకృష్ణ మాదిగను సన్మానించిన చైర్‌పర్సన్

జమ్మికుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి వచ్చిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈసందర్భంగా శాల్వతో ఘనంగా సన్మానించారు.

మబ్బులతో రైతుల్లో ఆందోళన

చిగురుమామిడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షం సూచనలు ఉండడంతో మండల రైతులు తీవ్రఅందోళనలు చెందుతున్నారు. ధాన్యంకుప్పలపై ప్లాస్టిక్‌కవర్లు లేక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ఏర్పాటుచేసిన కొనుగోలుకేంద్రాల్లో కొనుగోళ్లు నత్తనడకన జరు గుతుండడంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి ముప్పతిప్పలు పడుతున్నారు. కొన్నిగ్రామాల్లో హమాలీల సమస్య, మరికొన్ని గ్రామాల్లో నిర్వాహకుల సమస్య, ఇలాధాన్యం కోనుగోళ్లు సక్రమంగా జరగడంలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా కోనుగోల్లు వేగవంతంచేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని, అధికారులు సైతం ప్రతిరోజు గ్రామాలను సందర్శించి ధాన్యం కోనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

● మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టించుకోవాలి..

- కోమటిరెడ్డి జైపాల్‌రెడ్డి, మండల రైతు సంఘం అధ్యక్షుడు

ధాన్యం కోనుగోళ్ల విషయంలో అధికారులకే అవగహన లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ధాన్యం కొనుగోళ్లు త్వరగా జరిగేలా చూడాలి.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశరాజుపల్లి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు వేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, మాజీసర్పంచ్ కోలరమేష్, ఎల్లేష్‌కుమార్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే

రామడుగు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీప్రగతి హైస్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ హాజరై విద్యార్థులకు పట్టాలను అందజేశారు.

పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ చైర్మన్

ఇల్లందకుంట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషిచేసిన పోలీసులను ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు శుక్రవారం కలిశారు. ఈసందర్భంగా జమ్మికుంట సీఐలు కిశోర్, రవి, ఇల్లందకుంట, వీణవంక ఎస్ఐలు రాజకుమార్, తిరుపతికి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి, ప్రసాదాన్ని అందజేశారు. బ్రహ్మోత్సవాలు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా భారీ బందోబస్తు ఏర్పాటుచేసి విజయవంతం చేయడం అభినందనీయమన్నారు.

దళిత రత్న అవార్డు

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికి చెందిన దళితనేత బత్తుల పాండు సామాజిక, దళిత బహుజన ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమాలు నడిపించినందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో దళితరత్న అవార్డు అందజేసింది. అవార్డు రావడంపై సంతోషం వ్యక్తంచేస్తూ అంబేద్కర్ యువజనసంఘం, దళిత, ప్రజా సంఘాల నాయకులు బత్తుల పాండును శుక్రవారం ఘనంగా సన్మానించారు.

ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని ప్రమాద ప్రాంతాలను గుర్తించే వీలుగా రహదారులపై రేడియం స్టిక్కర్లు అంటించారు. అలాగే హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి, కేశవపట్నం గ్రామాల్లోని పలు రహదారి భద్రత చర్యలను చేపట్టారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించే ప్రమాద ప్రాంతాలుగా గుర్తించిన చోట్ల మోటర్ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశామన్నారు.

మా రహదారి భద్రతబృందం నిరంతరంగా ఈ ప్రాంతాలను పర్యవేక్షిస్తూ, తీసుకున్న చర్యల ప్రభావాన్ని గమనిస్తూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐలు తిరుమల్‌గౌడ్, వెంకట్‌గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వీణవంక, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేతిగల్, వీణవంక, పోతిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులతో శనివారం ఉదయం 9-30నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ అధికారులు ప్రకటనలో తెలిపారు. వీణవంక, నర్సింగాపూర్, లస్మక్కపల్లి, రెడ్డిపల్లి, బ్రాహ్మణపల్లి, శ్రీరాములపేట, కొండపాక, హిమ్మత్‌నగర్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లో విద్యుత్ అంతసరాయం ఉటుందని తెలిపారు.

క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి

గంగాధర, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని ఎస్ఐ వంశీక్రిష్ణ అన్నారు. శుక్రవారం గంగాధర క్రికెట్ జట్టు 16మంది క్రీడాకారులకు గ్రామానికి చెందిన న్యాలకొండ ప్రవీర్‌రావు షూస్ అందజేశారు. కార్యక్రమానికి హాజరైన ఎస్ఐ వంశీక్రిష్ణ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువు, క్రీడల వైపు ప్రయాణించాలన్నారు. కార్యక్రమంలో కొండగట్టు మాజీడైరెక్టర్ ఉప్పుల గంగాధర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన

గన్నేరువరం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజల కోసం ప్రాథమికఆరోగ్యకేంద్రం నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేయనున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు అనువుగా ఈ స్థలం ఉండడంతో అధికారులు ఇక్కడే పీహెచ్‌సీకి స్థలాన్ని కేటాయించారు.